కథానిక

# నిజరూపాలు

రచన:

శ్రీ. క్రోవి రామమోహన శాస్త్రి.

రాత్రి ప్రగాఢ సుషుప్తిలో వుంది.

నిశ్శబ్దం జోకొడుతోంది. చలీ చీకటీ సరసాలాడుకుంటున్నాయి. చలి నవ్విస్తోంది; చీకటి నవ్వుతున్నది. వికృతంగా.

మేడమీద రీడింగ్ రూంలో డాక్టర్ ప్రసాదరావు ఏదో నవల చదవడంలో లీనమై వున్నాడు. తలచుట్టూ మఫ్లర్ చుట్టుకున్నాడు. తెరచివున్న గది కిటికీలోంచీ కాగితాలు రెపరెపలాడుతున్నాయి. గ్రంథ పఠనానికి ఆ శబ్దం ఆటంకం కలిగిస్తోంది. ప్రసాదరావు తన నైట్ గౌన్ పాకెట్‌లోంచీ సిగరెట్ కేసూ, అగ్గిపెట్టె, బైటికి తీశాడు. ఓ స్వేతసమిధ ముట్టించి కేసును రెపరెపలాడే పుస్తకం మీద పెట్టాడు. యిప్పుడు శబ్దం రావటం లేదు— కిటికీలోనుంచీ చలిగాలి తప్ప. చాలా బాగుంది నవల— ఉదాత్తమైన పాత్ర చిత్రణ—అనుకుంది అతని మేధ.

అదొక నిరుపేద చిత్రకారుని హృదయ విదారకమైన జీవిత గాథ.

ప్రసాదరావు సిగరెట్టు పొగను రెండు దమ్ములాగి కిటికీ వైపుకు వూదాడు. బైటినుంచీ వచ్చేగాలికీ — ఆ పొగకూ మధ్య ఘర్షణ జరిగింది. ఆ పొగ నవలలోని చిత్రకారుడిలాగే ఓడిపోయి, వెనుదిరిగి గదంతా అల్లుకుని, కొద్దిక్షణాల్లోనే అస్తిత్వాన్ని కోల్పోయింది. ఆ తరవాత అక్కడ దాని తాలూకు వాసన మాత్రమే మిగిలింది.

ప్రసాదరావు నవల చదువుతూనే సిగరెట్టు పొగ పీల్చి వదులుతున్నాడు.

ప్రసాదరావు సహజంగా కళాభిమాని. అనేకమంది విఖ్యాత చిత్రకారుల చిత్రాలు అతనిగది గోడలనిండా అలంకరించబడి వుంటాయి. వాటిని తెచ్చుకునే ప్రయత్నంలో తను ఖర్చుపెట్టిన డబ్బునూ, 'ఆ పిచ్చి బొమ్మలకు' అంత డబ్బు ఖర్చు చెయ్యడమేమిటని భార్య పెట్టిన చీవాట్లూ తల్చుకొని 'ఇప్పటికి' కూడా నవ్వుకుంటూ వుంటాడు.

ప్రసాదరావు భార్య రమాదేవి చదువుకున్నదే! అయినా ఆమెలో పాతవాసనలు యింకా జీర్ణించుకునే వున్నాయి: అవి ఆమెకు వంశానుగతంగా సంక్రమించినవి. అంత తేలికగా పోయేవి కావు. ఆమెను మార్చడానికి ప్రసాదరావు చాలాసార్లు ప్రయత్నించి విఫలమైనాడు కూడా! తన వైఫల్యతకు చాలా బాధపడినా, దానిని బైటికి వ్యక్తపరుచుకోలేకపోయాడు. భార్యంటే ప్రసాదరావుకు చాలా ప్రేమ. తన ప్రేమనూ, దాని పరిమాణాన్నీ వర్ణించడానికి భాష లేదని గర్వపడుతూంటాడు — అప్పుడప్పుడు. తన ప్రయత్నాలు విఫలమయ్యేసరికి "స్థిరమైన అభిప్రాయాన్ని మార్చడం చిటికెన వ్రేలిమీద కొండనెత్తడం వంటిదనే" సూక్తిని జ్ఞాపకానికి తెచ్చుకుని అసలా అభిప్రాయానికే తిలోదకాలు వదిలేసి ఊరుకున్నాడు. పోనీ తనే భార్య అభిప్రాయాలకు అనుగుణంగా నడ్చుకుంటే! ఇది అతనికి నచ్చిన విషయం. అందుకే సాధ్యమైనంత వరకూ తన కళాభిమానాన్ని లోలోపనే దాచుకుని భార్యకు అనుగుణంగా నడుచుకుంటున్నాడు. ఇందులో కొంతవరకు నటన లేకపోలేదు. అయితేనేం? భార్య మారలేదని తనూ, తను మారలేదని భార్య—రెండు విభిన్న మార్గాలలో నడుచుకునే దానికంటే కొంతనటనతో నరక ప్రాయం కాబోయే సంసారాన్ని చక్కదిద్దుకున్నాడు ఈ విషయం కూడా అతనికి మరో గర్వకారణం.

* * *

నవల చదవటం పూర్తయింది. పుస్తకం మూసేసి, మరో సిగరెట్టు ముట్టించాడు. కుర్చీలో వెనక్కివాలి, ఆలోచన సాగించాడు—పిచ్చివాడుగామారిన నవలలోని చిత్రకారుడ్ని గురించి.

ప్రసాదరావు గుండె బరువెక్కింది. ఆ కళారాధకుడ్ని నరకయాతనలపాలు చేసిన సమాజం అంటే అతనికి ఏహ్యభావం కలిగింది. కళను గౌరవించే శక్తి మన సమాజంలో ఎందుకు కొరవడిందో అతనికి అర్థం కాలేదు. అప్పుడప్పుడు తనకే శక్తి వుంటే—ఈ సమాజంలో కళా వినాశకులైన చీడపురుగులను కత్తితో కండగా

కోసి కాకులకూ గ్రద్దలకూ వెయ్యాలని అనుకునేవాడు.

ప్రసాదరావు లేచి వెళ్ళి కిటికీ వారగా నిలబడ్డాడు. చుట్టూ ఎటు చూసినా ప్రశాంత గూడు కట్టుకున్నది. దూరంగా రోడ్డు ప్రక్కల విద్యుద్దీపాలున్నా కాస్తంత మేరా వెలుగులు—వాటిచుట్టూ సాలెగూళ్ళలా అల్లుకున్న చీకట్లు. వీటిని చూస్తుంటే అతనికి నవలలోని చిత్రకారుడూ, అతన్ని అణగ ద్రొక్కి వేసిన ఈ దుష్ట సమాజమూ కళ్ళకు కట్టినట్లు కనిపించారు.

నిట్టూర్చాడు ప్రసాదరావు. సిగరెట్టు పొగలు నోట్లోంచీ, ముక్కుల్లోంచీ కొంచెం ముందూ వెనగ్గా బైటికి జారినై.

తాలూకా ఆఫీసులోంచి పన్నెండు గంటలు వినిపించాయి—నిశ్శబ్దాన్ని ఛేదించుకుంటూ, విస్పష్టంగా. అబ్బ...చాలా టైమయింది! అనుకుంది ప్రసాదరావు మనస్సు ఆవలిస్తూ. నోరు మనస్సుని అనుకరించింది. కుడి చేతి బొటనవ్రేలూ, మధ్యవ్రేలూ తాళం వేశాయి అప్రయత్నంగా.

వెనక్కి తిరగబోయిన ప్రసాదరావు ఎవరో చెప్పినట్లు నిల్చిపోయాడు. నిశితంగా కాంపౌండు గేటు కేసి చూశాడు. ఓ జట్కాబండి గేటుముందు రోడ్డు మీదట ఆగింది అప్పుడే.

రమ వచ్చిందా! కాదని వెంటనే మనస్సు జవాబిచ్చింది—దృఢంగా. అవును ఆమె అయివుండదు. అర్థగంట క్రితమే స్టేషన్‌కి కారు పంపించాడు. ఆమెకి జట్కాలో రావలసిన కర్మమేమిటి? అదీగాక ట్రెయిన్ రావడానికి యింకా టైముంది. అయితే ఎవరైవుంటారు—వచ్చినవారు? ఇదీ అతని ముందు నిలిచిన ప్రశ్న! జవాబులేని ప్రశ్న......పోష్టు చెయ్యని ఉత్తరం!

ఎవరైనా పేషెంట్లేమో! అబ్బే...అయివుండరు. అలాంటి వాళ్ళయితే సరాసరి హాస్పిటల్‌కే వెడతారు. యిక్కడికెవరూ రారు! ఇంకా ఏవేవో ఆలోచించటానికి పూనుకునే లోపలే జట్కాలోంచి ఎవరో ఓ యువకుడు దిగడం చూశాడు ప్రసాదరావు. అతని చేతులో ఏదో వస్తువున్నది.

అదేలాంటి వస్తువో డాక్టర్‌కి స్పష్టంగా కనిపించలేదు. ఆ యువకుడు జట్కాలో వున్నవారితో ఏదో అంటున్నాడు. కదుల్తున్న గుర్రాన్ని అదిలిస్తున్న జట్కావాడి బోదురుకప్ప స్వరంలో కలిసి పోయింది తని మాట! విసుక్కున్నాడు ప్రసాదరావు జట్కావాడి మీద...వెధవ! మాట విననివ్వడు...అని.

ఆయువకుడు గేటు తోసుకుని లోపలికి వస్తున్నాడు. వరండాలో కిటికీ చువ్వకి కట్టేసివున్న అల్సేషియన్ భీకరంగా గర్జించింది. యువకుడు అట్టే నిలిచిపోయాడు. కట్టేసి వుందో లేదో అని ఆలోచిస్తున్నట్లున్నాడు—అనుకున్నాడు ప్రసాదరావు.

అల్సేషియన్ మళ్ళా ఓసారి గట్టిగాహూంకరించింది.

తలుపు తీసిన శబ్దం. స్విచ్ వేసిన ధ్వని వినిపించకపోయినా, లైటు వెలగడం కనిపించింది.

చంద్రయ్య లేచాడు — అనుకున్నాడు ప్రసాదరావు. లైటు వెలుగులో ఆ యువకుడ్ని స్పష్టంగా చూశాడతను అందమైన యువకుడు.

'టైగర్!' అన్న చంద్రయ్య కేక మందంగా వినిపించింది. యువకుడు ముందుకు నడుస్తున్నాడు.

ఎక్కడో చూశానితన్ని... ఎక్కడబ్బా... అని గతంలోకి తొంగిచూసాడు ప్రసాదరావు. కాని ఫలితం లేకపోయింది. కొన్ని జ్ఞాపకాలు ఒకంతట బైటపడవు—అనుకున్నాడు.

'డాక్టర్ గారి కోసం వచ్చాను.' అన్నాడా ఆగంతకుడు.

'వేళాపాళాలేకండా వస్తే ఎలాగండీ! అయ్యగారు నిద్రపోతున్నారు.' అన్నాడు చంద్రయ్య — అయ్యగారి నిద్రసంగతలావుంచి, యింకాస్సేపు అతనితో మాట్లాడితే తన నిద్రచెడిపోతుందని భయపడుతూ!

నవ్వుకున్నాడు ప్రసాదరావు. సిగరెట్ కేసూ, అగ్గిపెట్టె జేబులో వుంచుకుని గదిలోంచి బైటికి నడిచాడు. మెట్లు గడిచి కింది హాల్లోకి వచ్చాడు.

'చంద్రయ్యా!' అని పిల్చాడు.

'అయ్యా!' అన్నాడు చంద్రయ్య.

'అతన్ని లోపలికి రమ్మను.' అన్నాడు ప్రసాదరావు—హాల్లో—మధ్యనున్న సోఫాలో కూర్చుంటూ.

కొన్ని క్షణాల్లో యువకుడు లోపలికి వచ్చాడు.

'గుడ్‌నైట్ డాక్టర్! అర్ధరాత్రివేళ మీకు చాలా శ్రమ యిచ్చాను. క్షమించండి.' అన్నాడు.

'శ్రమ అనే మాటకు అర్థంలేదు నా నిఘంటువులో.

శ్రమ పడని డాక్టర్ పనికి రాడీ ప్రపంచానికి. రండి... కూర్చోండి.? అంటూ, ఎదురుగా వున్న మరో సోఫా చూపించాడు. అతన్ని ఎక్కడ చూశాడో జ్ఞప్తికెచ్చుకోవాలని ప్రయత్నిస్తూనే వున్నాడు.

అగంతకుడు తన చేతిలోని వస్తువుమీద చుట్టిన కాగితాన్ని సర్దుతూ వచ్చి సోఫాలో కూర్చుని 'థాంక్యూ డాక్టర్!' అన్నాడు.

"ప్రతి స్వల్ప విషయానికీ థాంక్స్ స్వీకరించే అలవాటు నాకులేదు మిష్టర్...మిష్టర్..." అన్నాడు ప్రసాదరావు అతని పేరు గుర్తురానందుకు యిబ్బందిగా మొహం పెడుతూ!

'రఘు' అన్నాడు అగంతకుడు.

తల పంకించాడు ప్రసాదరావు. సిగరెట్ కేసూ, అగ్గిపెట్టే బైటికి తీసి, ఓ సిగరెట్ నోట్లో వుంచుకుని కేసును టీపాయ్‌మీద రఘు ముందుకు పెడుతూ, మిమ్మల్నెక్కడో చూసినట్లు గుర్తు. అన్నాడు.

క్షణం నిశ్శబ్దం. ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు.

'రెండు మాసాల క్రితం ఈ వేళప్పుడే నా భార్యకు సీరియస్‌గా వుందనీ, రావలసిందనీ మిమ్మల్ని ప్రార్థించాను. మీరు వెంటనే బయలుదేరారు. దారిలో మనం ఓ యాక్సిడెంటు నుంచీ వెంట్రుక వాసిలో తప్పించుకున్నాం. గుర్తుందా మీకు?' అని అగాడు రఘు.

'యస్...యస్!... నా కార్లోనే కదూ, మనం బయలుదేరింది! దారిలో లారీ డాష్ అయ్యే ప్రమాదం! అవును మిష్టర్ రఘూ! నాకు బాగా గుర్తొచ్చింది. మీరు ఆర్టిస్టులు కూడా! కదూ!' అన్నాడు ప్రసాదరావు ఆప్యాయంగా!

'ఏదోలెండి!' అన్నాడు రఘు తన సహజ సిద్ధమైన సిగ్గును దాచుకోవటానికి ప్రయత్నిస్తూ.

'అల్లా అనకండి! కళాకారులు ధన్యజీవులు. నిజానికి వాళ్లే భగవంతుని కరుణా కటాక్షాలకు పాత్రులు. తమకు వరదత్తమైన కళకు క్షణక్షణం ఓకొత్త జీవాన్ని కలిగిస్తూ భగవంతుణ్ణి మెప్పించగలరు. అందుకే 'కళాకారు'లంటే నాకు చాలా అభిమానం. కనీసం అరవై నాలుగు కళల్లో ఏ ఒక్క కళనూ భగవంతుడు నాకు ప్రసాదించ నందుకు నేను ఎప్పుడూ భాధపడుతూ వుంటాను.' అని ప్రసాదరావు నిట్టూర్చాడు.

'ఎందుకు భాధపడాలి! వందలాది మంది జీవితాలకు పునర్జన్మ ప్రసాదించ గలిగిన మహత్తరమైన కళను ప్రసాదించాడు. అదొక్కటీ చాలదా?' అన్నాడు రఘు.

'ఒక్క కేసు ఫెలయితే ఆ డాక్టరు పేరు ప్రతిష్టలు గంగ పాలే కదా!' అని నవ్వాడు, ప్రసాదరావు. రఘు కూడా చిరునవ్వు నవ్వాడు.

'ఏమిటీ అర్ధరాత్రివేళ వచ్చారు? అన్నట్లు బైట జట్కా ఆగివున్నట్లుంది!' అంటూ ప్రసాదరావు రఘు మొహంలోకి ప్రశ్నార్ధకంగా చూశాడు.

'అవును డాక్టర్! అనుకోకుండా ఈవూరునుంచీ వెళ్ళిపోవలసివచ్చింది. అదృష్టవశాత్తూ అనుకోండి...' అన్నాడు రఘు.

'అంటే...?' అన్నాడు ప్రసాదరావు.

'మద్రాసులోని ఒక సుప్రసిద్ధ పత్రికా కార్యాలయంలో ఆర్టిస్ట్‌గా ఉద్యోగం వచ్చింది. ఆర్డరు చాలా ఆలస్యంగా ఈవేళే చేరింది. రేపటిలోగా జాయిన్ కావాలి. అందుకే అనుకోకుండా ప్రయాణమయినాం!' అన్నాడు, రఘు.

'అలాగా! కంగ్రాచ్యులేషన్స్! హార్టీ కంగ్రాచ్యులేషన్స్.' అన్నాడు ప్రసాదరావు.

'థాంక్యూ వెళ్ళేలోగా మిమ్మల్నోసారి కలుసుకోవాలనుకున్నాను. ప్రొద్దుట్నుంచీ ఎంత ప్రయత్నించినా వీలుపడకపోయింది. ఇప్పుడు స్టేషన్‌కి వెళ్ళే త్రోవ యిదే కావటంతో-అర్ధరాత్రి అయినా...'

'లోపలికి వచ్చేశారన్నమాట...' అని అతని వాక్యాన్ని మధ్యలోనే అందుకుని పూర్తిచేసి నవ్వాడు ప్రసాదరావు.

'అవును, డాక్టర్! మీకు మరోసారి కృతజ్ఞతలు చెప్పుకోవాలనిపించింది. మృత్యు ముఖంనుంచీ నా భార్యను కాపాడి నాకు మహోపకారం చేశారు. మీకు జన్మజన్మలకూ కృతజ్ఞుడ్ని. నేను చెల్లించిన ఫీజు చాలా తక్కువ కావడంవల్ల నేనెంతో బాధపడుతున్నాను.' అన్నాడు, రఘు.

'చూడండి మిష్టర్ రఘూ! మనిషి తనతోటివాడ్ని ఆదుకోవడం ధర్మం. నేను ఆ ధర్మాన్ని పాటించాను. డబ్బుదేముంది? గాన్ని మనం కట్టుకుపోతామా?' అన్నాడు ప్రసాదరావు.

'మీ హృదయం ఎంత విశాలమో నాకిదివరకే అర్థమైంది డాక్టర్.' అంటూ రఘు తన చేతులోవున్న వస్తువుమీది కాగితాన్ని విప్పి 'డాక్టర్! ఈ చిత్రాన్ని-నిద్రాహారాలు మాని,-ఎంతో శ్రమపడి గీశాను. ఇంత కంటే మించినది-యింతవరకూ నేను గీయలేదు. ఇక ముందు గీస్తాననే నమ్మకం నాకు లేదు. మీరు కళాభిమానులు. మీవంటివారివద్ద నాబోటి చిన్న ఆర్టిస్టుల చిత్రం ఒకటుంటే—అదే కీర్తి. కృతజ్ఞతాపూర్వకంగా ఇది మీకు సమర్పించుకుంటున్నాను. స్వీకరించండి.' అని చిత్రాన్ని డాక్టర్‌కి అందించాడు.

ప్రసాదరావు యాధాలాభంగా దానివంక చూశాడు. ఆ చూపు చాలసేపు అల్లే నిలచిపోయింది.

అతని రక్తం ఉడికి పోయింది. నరాలు జివ్వుమంటూ ఒక్కసారిగా విజృంభించి ఎక్కడెక్కడికో పరుగులు తీస్తున్నాయి.

'శలవు డాక్టర్! మిమ్మల్ని శ్రమ పెట్టాను. ట్రెయిన్ టయిమవుతోంది. వస్తాను. నన్ను మరిచి పోకండి.' అని లేచినిలబడి, రెండుచేతులూ జోడించి, ప్రసాదరావుకు నమస్కరించాడు రఘు. ప్రసాదరావు ఏమో అనబోయాడు. అంతలోనే రఘు మందహాసం చేసి మరో సారి నమస్కరించి బైటికి వెళ్ళిపోయాడు.

కొన్ని క్షణాలకు జట్కావాడు గుఱ్ఱాన్ని అదలించటం స్పష్టంగా విన్నాడు, ప్రసాదరావు.

కలా? నిజమా - అని క్షణంపాటు ప్రసాదరావు తీవ్రంగా ఆలోచించాడు. గేటు ముందు గుర్రబ్బండీ, గేటు తోసి లోపలికి వచ్చిన రఘు, అల్సేషియన్ గర్జారావం, తలుపు తీసి చంద్రయ్య విసుక్కోవటం, రఘు చిత్రాకరించిన నగ్నచిత్రం - యివన్నీ నిజామేనా?

అవును - అన్నది అతని కంపిత కరాల మధ్య వున్న బహుమతి. సిగరెట్టు వెలిగించాడు ప్రసాదరావు. పొగ పీల్చి వదుల్తూ, చిత్రం వైపొకసారి చూశాడు.

అతనిలో విచిత్రానుభూతులు వికటంగా హసించాయి. ఆ చిత్రంలోని నగ్న స్త్రీ మూర్తి సౌందర్య శిఖలు అతని శరీరంలోకి మదన మార్గణాలు గ్రుచ్చుతున్నాయి. ఆమె ఒక్కొక్క అవయవం ఒక్కొక్క ఉద్రేకపు కడలి. అతని ఒక్కొక్క కదలికా ఒక్కొక్క వాంఛా తరంగం. అతని హృదయం ఆక్షణంలో ఆ సాగర గర్భంలో పుట్టిన వాయుగుండం.

రఘు కళానైపుణ్యానికీ, అతని కుంచె యొక్క నిరంకుశత్వానికీ-ప్రసాదరావులోని కళాభిమానం అంజలి ఘటించింది. రఘు నిజమైన కళాకారుడు. కాకంటే అతనీ చిత్రాన్ని గీయడం అసాధ్యం - అనుకున్నాడు, నిండు గుండెలో ప్రసాదరావు. అతని నేత్రాలు బాష్ప పూరితాలయ్యాయి.

ఆ చిత్రాన్ని చప్పున గుండెలకు హత్తుకున్నాడు.

'ఏమిటయ్యగారూ అది?' అన్నాడు చంద్రయ్య ఆశ్చర్యంగా.

ఉలిక్కిపడ్డాడు, ప్రసాదరావు. చంద్రయ్య సంగతి తనకి బాగా తెలుసు. తానులేనప్పుడు భర్తనోకంట కనిపెడుతూండమని (ఇలాంటి బొమ్మల వ్యవహారాల్లో)రమ నియోగించి వెళ్ళిన గూఢచారి చంద్రయ్య. వాడు దగ్గిరికి రాకముందే (?) జాగ్రత్త పడటం అవసరమని క్రింద పడున్న పేపర్ను గబగబ దానికి చుట్టి 'ఏం లేదు. ఏదో ఫోటో' అన్నాడు.

ఇంతలో విజిటర్స్ గదిలో ఫోన్ మోగింది. ప్రసాదరావుతో ప్రత్యేకంగా సంప్రదించటానికి చాలామంది పెద్దమనుషులు వస్తూ-పోతూవుంటారు. వారితో కన్సల్ట్ చేసేందుకే ఓ గది కేటాయించాడు. ఫోను అందులోనే వుంది. ప్రసాదరావు ఫోటో పట్టుకునే విజిటర్స్ గదిలోకి వెళ్ళాడు. లైటు వేసి రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చుని, ఎదురుగా టేబిల్ మీద ఎడంచేతి ప్రక్కగా వున్న ఫోన్ రిసీవర్ అందుకున్నాడు.

'హల్లో...' అన్నాడు.

'నేనే సార్! డ్రైవర్ని. స్టేషన్నుంచీ మాట్లాడుతున్నాను.' అన్నాడు డ్రైవర్ అవలి వైపునుంచి.

'ఏమిటోయ్ విశేషం!'

'ఏంలేదు సార్. ట్రెయిన్ రెండు గంటలు లేటట. కారు తీసుకుని వచ్చెయ్యమంటారా?' అంటూ డ్రైవరు ఫోన్‌లోనే ఆవలించాడు.

రెండు గంటలు లేటా! అయితే అంతసేపూ అక్కడెందుకు? అని

'వచ్చెయ్యి!' అని చెప్పి, రిసీవర్ దించేశాడు. చిత్రాన్ని టేబిల్ మీదుంచాడు.

(సశేషం)